క్లుప్తంగా

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు సర్కిల్ పరిధిలోని ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లించేలా ప్రత్యేక కౌంటర్లు పని చేస్తాయని విద్యుత్ శాఖ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు అందుబాటులో ఉంటాయన్నారు. అలానే ఇంటి నుంచే నేరుగా విద్యుత్ బిల్లులు చెల్లించేలా మొబైల్‌లో ఏపీసీపీడీసీఎల్ కస్టమర్ యాప్, ఫోన్ పే, గూగుల్ పేల నుంచి కూడా చెల్లించవచ్చని ఆయన పేర్కొన్నారు.

తప్పుల తడకగా ఎస్సీ జనాభా జాబితా

నెహ్రూనగర్: ఎస్సీ కులగణన(మాల/మాదిగ)పై రాష్ట్ర ప్రభుత్వం సచివాలయంలో పొందుపరిచిన ఎస్సీ జనాభా తప్పులతడకగా ఉందని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్‌కుమార్ ఆరోపించారు. శనివారం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సచివాలయంలో ఏర్పాటు చేసిన ఎస్సీ జాబితాను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సామాజిక వర్గం ఎక్కువగా ఉన్నట్లు, మరోక సామాజిక వర్గం తక్కువగా ఉన్నట్లు జాబితా పొందుపరిచారని దీని వలన ఒక సామాజిక వర్గానికి అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. సోషల్ ఆడిట్ అనేది ఇంటింటి వివరాల సేకరించకుండా.. గతంలో ఉన్న పాత లెక్కలను ప్రదర్శించారని చెప్పారు. దీని వలన మాల సామాజిక వర్గానికి అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. మాల జనాభా ఎక్కడ ఉందో వారి వద్దకే వెళ్లి కులగణన చేపట్టాలని కోరారు. కులగణనపై ఏర్పాటు చేసిన రాజీవ్ మిశ్రా కమిషన్ దృష్టికి ఈ సమస్యను తీసుకువెళతామన్నారు.

అలరించిన శ్రీకృష్ణమంజరి కీర్తనల గానం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శ్రీకృష్ణ మంజరి అనే శీర్షికలోని శ్రీకృష్ణుని కీర్తనల గాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. బెల్లంకొండ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా చింతలపాటి రమాగోపాల కృష్ణ బృందం గానం చేశారు. రమాగోపాలకృష్ణ, అంజనీదేవి, నాగలక్ష్మి, పావని గాత్రధారణలో జగదీశ్వరుడు, బాలగోపాల హరే, నీ నామమే, పూజలందరు, మద్దుగారే యశోద వంటి కీర్తనలు అలపించారు. ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వయోలిన్‌పై చావలి శ్రీనివాస్, మృదంగంపై జగన్మోహిని వాయిద్యాన్ని అందించారు.

ముగిసిన పౌరాణిక నాటక ప్రదర్శనలు



నగరంపాలెం: స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రెండు రోజులుగా నిర్వహిస్తోన్న పౌరాణిక నాటక ప్రదర్శనలు శనివారంతో ముగిశాయి. పౌరాణిక కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరగ్గా, అధ్యక్షుడు నల్లక శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. తొలుత డాక్టర్ ఎం.ఫర్నికుమార్ సినీ గీతాలాపన నిర్వహించారు. పాండవోద్యగం, మయ సభ, శ్రీకృష్ణరాయబారం, బాలనాగమ్మ, రాజనర్తకి, సత్య హరిశ్చంద్ర వంటి ప్రముఖ నాటికల్లో ముఖ్య ఘట్టాలు, పౌరాణిక పద్యాలతో ప్రదర్శించారు. పలువురు కళాకారులు చక్కగా ప్రదర్శించగా, ఆహుతులను అలరించాయి.

సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలి



గుంటూరు ఎడ్యుకేషన్: జీవితాన్ని సమర్థంగా నిర్వహించేందుకు ఐదు సూత్రాలను పాటించాలని ఈగర్ టు ఫోర్జ్ ఎహెడ్ (ఇండియా) ప్రతినిధి లిపికా రథ్ పేర్కొన్నారు. శనివారం అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఈగర్ టు ఫోర్జ్ ఎహెడ్(ఇండియా) ఆధ్వర్యంలో 'జీవితాన్ని సమర్థంగా నిర్వహించేందుకు ఐదు సూత్రాలు' అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా లిపికా రథ్ మాట్లాడుతూ జీవితంపై సానుకూల దృక్పథతో ముందుకు సాగాలన్నారు. ధనాత్మక ఆలోచనలు, ధైర్యం, మంచి ఆచరణ కలిగిన మనసు అసాధ్యాన్ని సైతం సుసాధ్యంగా చేస్తుందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ ఈగర్ టు ఫోర్జ్ ఎ హెడ్ ప్రతినిధులు రాజేష్‌కుమార్ సాహు, అసోంబితా పొద్దార్, కె. హరిహరన్, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి.చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, ప్లేస్‌మెంట్ అధికారి చల్లా వైష్ణవి, సహాయాచార్యులు సీహెచ్ వేదవతి, ఏ బాజీబాబు, ఎన్.మణికంఠ, బి.అనిత, రాజేశ్వరి పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో గ'లీజు' వ్యవహారం

చెక్కుల పేరుతో దోపిడీ
- రెవెన్యూ సిబ్బంది చేతి వాటం
- లీజు గడువు పూర్తయిన వసూళ్ల పర్వం



నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగ సిబ్బంది చెక్కుల పేరుతో దోపిడీ మొదలు పెట్టారు. గుంటూరు పరిధిలో నగరపాలక సంస్థకు చెందిన 57 షాపింగ్ కాంప్లెక్స్‌లలో వెయ్యికిపైగా షాపులు ఉన్నాయి. వీటిలో దాదాపు అన్ని షాపులకు లీజు గడువు పూర్తయింది. వీటిని నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోకపోగా... వాటిని రెన్యువల్ కూడా చేయక పోవడంతో సదరు షాపుల్లో వ్యాపారాలు కొనసాగుతూనే ఉన్నాయి.

డీఎంఏ దృష్టి..

లీజు గడువు పూర్తయిన వాటిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదని అయితే ప్రస్తుతం డీఎంఏ(డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్స్), స్వాధీనం చేసుకోకపోయినప్పటికి ఎందుకు రెన్యువల్స్ చేయడం లేదని ప్రశ్నించడంతో నగర కమిషనర్ లీజులపై సీరియస్ అయ్యారు. వెంటనే వాటిని స్వాధీనం చేసుకోవడానికి, బకాయిలు కట్టించి రెన్యువల్ చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇదే అదునుగా లీజు దారుల నుంచి దోపిడీకి తెరతీశారు రెవెన్యూ సిబ్బంది.

వడ్డీ లేకపోయినా చెల్లించలంటూ బెదిరింపులు

నగరపాలక సంస్థ పరిధిలో ఏదైన షాపును లీజుకు తీసుకోవాలంటే వేలం పాటలో పాల్గొని షాపు దక్కించుకుంటే దానికి సంబంధించి మూడు నెలల అడ్వాన్స్, ఇతర చెల్లింపులు జరిపిన తరువాత షాపు రెవెన్యూ అధికారులు కేటాయిస్తారు. అయితే మూడు నెలల పాటు షాపు అద్దె చెల్లించకపోతే ముందుగా తీసుకున్న అడ్వాన్స్‌లను సిస్టం ఆటోమెటిక్‌గా కట్ చేసుకుంటుంది. మూడు నెలల తరువాత నుంచి అద్దెకు సంబంధించి బకాయి రైజ్ అవుతుంది. ఆ నెల కూడా అద్దె చెల్లించకపోతే ప్రతి నెల 10వ తేదీ తరువాత వందకు రెండు రూపాయల వడ్డీతో అద్దెకు కలపి వస్తుంది. కొంత మంది లీజుదారులు అద్దె బకాయిలకు సంబంధించి చెక్కులను సకాలంలో ఇచ్చినప్పటి వాటిని సకాలంలో అధికారికంగా పోస్టింగ్ చేయకుండా అట్లాగే పక్కన పెడుతుంటారు. తీరా లీజు గడువు పూర్తయ్యే సరికి నీకు అద్దె, వడ్డీతో కలపి ఇంత అయింది.. అంత అయిందని చెప్పి బకాయి రసీదు లీజు దారుడికి అందజేస్తున్నారు. వడ్డీ చెల్లింపులు రూ.లక్షల్లో ఉండటంతో దానిని మాఫీ చేస్తాం. మాకు ఇంత అమౌంట్ ఇవ్వాలని చెప్పి వారి నుంచి భారీగా లాక్కుకుంటున్నారు.

చెక్కులకు ఆడిట్ లేకపోవడంతో

నగరపాలక సంస్థకు జమ అయ్యే చెక్కులకు సక్రమంగా ఆడిట్ లేకపోవడంతో రెవెన్యూ సిబ్బంది ఆడిందే ఆటగా...పాడింది పాటగా మారింది. రెండు సంవత్సరాల క్రితం కార్పొరేషన్‌కు జమ అయిన చెక్కును ఇప్పుడు రెవెన్యూ అధికారులు దానిని పోస్టింగ్ వేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

సిబ్బందే చెక్కులు వేస్తున్న వైనం

లీజు బకాయిలకు సంబంధించిన చెక్కును లీజుదారుడు నగరపాలక సంస్థకు ఇవ్వాల్సి ఉండగా.. లీజుదారుడి పేరుతో నగరపాలక సంస్థ రెవెన్యూ సిబ్బందే చెక్కలను సకాలంలో కార్పొరేషన్‌కు జమ చేస్తున్నారు. అయితే జమ చేసిన చెక్కులను వివరాలను పోస్టింగ్ చేయకుండా ఎప్పుడేతే లీజు గడువు పూర్తవుతుందో..ఎప్పుడైతే అధిక వడ్డీ రైజ్ అవుతుందని తెలుసుకుంటారో అప్పుడు సదరు లీజుదారుడికి సంప్రదించి లీజు గడువు పూర్తయింది. అద్దె, వడ్డీ భారీ స్థాయిలో పెరిగిపోయింది. వడ్డీ మాఫీ చేస్తామని లీజుదారులతో బేరసారాలు జరుపుకుని వాటిని మాఫీ చేయడం పరిపాటిగా మారిందనే చెప్పుకోవచ్చు. లీజుదారుడి నుంచి మామూళ్లు తీసుకున్న తరువాత ముందుగా వేసి ఉంచిన చెక్కును పోస్టింగ్ చేస్తున్నారు. ఆ చెక్కు కార్పొరేషన్‌కు జమ అయిందని, రెవెన్యూ సిబ్బంది చెప్పడమే తప్ప, ఆ చెక్కు కార్పొరేషన్ ఖజానాకు జమ అయిందా లేదా అని అకౌంట్ సెక్షన్ నుంచి కన్ఫర్మేషన్ కూడా తీసుకుని పరిస్థితిలో ఉన్నారు.

చెక్కు ఇచ్చిన వెంటనే పోస్టింగ్ వేయాలి

లీజు దారుడు అద్దె బకాయిలకు సంబంధించిన చెక్కులు ఇచ్చినట్లయితే వెంటనే పోస్టింగ్ వేయాలి. అలా కాకుండా హోల్డ్ పెట్టడానికి కుదరదు. వడ్డీ మాఫీ కుదరదు..అయినప్పటికి చెక్కుల పోస్టింగ్‌పై విచారణ చేపడతాం.
– డి.శ్రీనివాసరావు, డెప్యూటీ కమిషనర్

భూ రికార్డుల పరిశీలనకు బృందాలు ఏర్పాటు



మాట్లాడుతున్న సంయుక్త కలెక్టర్ భార్గవ్ తేజ

పొన్నూరు: పొన్నూరులో భూ రికార్డులను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలతో సర్వే నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ తెలిపారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఐదుగురి పేర్లతో సుమారు రెండు వందల ఎకరాలు మ్యుటేషన్ అయిన భూ సంబంధిత రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సంబంధిత భూములను సర్వే చేయనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఆ భూమి ఎవరి ఆధీనంలో ఉందో తెలుసుకునేందుకు బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ ఉన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో వినతుల స్వీకరణ

పొన్నూరు: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు, ప్రజలు తమ సమస్యలపై అర్జీలు దాఖలు చేయాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. శనివారం మండలంలోని ములుకుదురులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 40 అర్జీలను స్వీకరించి వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని తహసీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో సర్వేయర్ సత్యనారాయణ, ఆర్ఐ శ్రీనివాస్,సీనియర్ అసిస్టెంట్ రామారావు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఫార్మా క్విజ్ పోటీలు



విజేతలతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ఐఎస్‌పీఓఆర్ ఏఎన్‌యూ స్టూడెంట్ చాప్టర్(ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ ఫార్మకో ఎకనామిక్స్ అండ్ రీసెర్చ్) ఐపీఏ లాం సంయుక్త సహకారంతో చలపతి ఫార్మసీ కళాశాలలో శనివారం జాతీయస్థాయి ఫార్మసీ క్విజ్-2024 పోటీలను నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మలేషియా క్వెస్ట్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ కొత్ర, సొల్యూషన్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ సైన్సెస్ సైకాలజిస్ట్ కౌన్సిలర్ డాక్టర్ బి.నగేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్ కొత్ర మాట్లాడుతూ వ్యాధిగ్రస్తునిపై వైద్యుని కంటే ఫార్మాసిస్టుల పాత్ర కీలక అంశం పోషిస్తుందని తెలిపారు. ఆరోగ్యకరమైన అద్భుతమైన ప్రపంచాన్ని సృష్టించగలిగే బాధ్యత ప్రతి ఫార్మసిస్టుల చేతుల్లో ఉందని చెప్పారు. డాక్టర్ బి.నగేష్ మాట్లాడుతూ ఫార్మా క్విజ్‌లలో పాల్గొనడం వల్ల విద్యార్థులకు ఆలోచన శక్తి పెరిగి పాఠ్యాంశాలపై పట్టు సాధిస్తారన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ ఏఎన్‌యూ స్టూడెంట్ చాప్టర్‌ను 2013వ సంవత్సరంలో స్థాపించడం జరిగిందని అప్పటి నుంచి ప్రతి ఏడాది ఐఎస్‌పీఓఆర్ సభ్యుల సహకారంతో చలపతి ఫార్మసీలో ఉచిత మెడికల్ క్యాంపులు, హెల్త్ అవేర్‌నెస్ క్యాంపులు, క్విజ్‌లు, వక్తృత్వ పోటీలు ఎన్నో నిర్వహిస్తున్నామన్నారు.

జీజీహెచ్‌లో టైమ్ బ్యాంక్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో టైమ్ బ్యాంక్ అనే వినూత్న కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా మొట్టమొదటిసారిగా గుంటూరు హిందూ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ చదువుతున్న 16 మంది విద్యార్థులు టైమ్ బ్యాంక్ కార్యక్రమంలో పేర్లు నమోదు చేసుకున్నారు. ఆస్పత్రికి వివిధ విభాగాల్లో 90 గంటల పాటు పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థులు వలంటీర్లుగా సేవలందించనున్నారు. ఇతర కాలేజీల నుంచి విద్యార్థులు టైమ్ బ్యాంకింగ్‌లో పేర్లు నమోదు చేసుకుని ఆస్పత్రికి తాము సేవ చేయాలనుకున్నప్పుడు సంప్రదించవచ్చని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ తెలిపారు. టైమ్ బ్యాంక్ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేస్తామని వెల్లడించారు. రోగులకు సేవ చేయాలనుకునే విద్యార్థులు ఆసుపత్రిలో తమకు నచ్చిన రోజు, తమకు నచ్చిన సమయంలో తమకు వీలు కుదిరినంత సమయంల సేవ చేసేందుకు టైమ్‌బ్యాంక్ అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు.

షెడ్యూల్ కులాల జాబితాలను పరిశీలించుకోవాలి

కాకుమాను: మండలంలోని గ్రామాలకు సంబంధించి షెడ్యూల్ కులాల వారి సర్వే జాబితాలను ఆయా గ్రామాలలోని గ్రామ సచివాలయాల్లో ప్రచురించినట్లు తహసీల్దార్ బి.వెంకటస్వామి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబితాల్లో నమోదైన షెడ్యూల కులాలకు చెందిన ప్రతి ఒక్కరూ సంబంధిత జాబితాలను పరిశీలించుకోవాలని కోరారు. జాబితాల్లో ఏమైన అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 31వ తేదీ లోగా ఆయా గ్రామాల వీఆర్వోలకు, పంచాయతీ కార్యదర్శులకు అర్జీలు అందజేయాలని సూచించారు. అర్జీలను వచ్చే ఏడాది 6వ తేదీలోగా పరిశీలించి 10వ తేదీన సంబంధిత గ్రామ సచివాలయాల్లో నివేదికను ప్రచురిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

దేశ ఆర్థిక అభివృద్ధికి మన్మోహన్ సింగ్ ఎనలేని కృషి



మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ మనోహర్ నాయుడు, ఎమ్మెల్యే బూర్ల

నెహ్రూ నగర్: దేశ ప్రధానిగా, ఆర్థిక మంత్రిగా భారత దేశ ఆర్థిక వృద్ధికి విశేష కృషి చేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్‌కి భారత రత్న పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం అందించాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు కోరారు. శనివారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు అధ్యక్షతన మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ సంతాప సభ నిర్వహించారు. మేయర్ కావటి శివ నాగ మనోహ నాయుడు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ భారతదేశం గర్వించదగిన మహోన్నత ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ మరణం తీరని లోటని, వారి కుటుంబానికి గుంటూరు నగర పాలక సంస్థ ప్రజల తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నామన్నారు. పార్టీలకు రాజకీయాలకు అతీతంగా అందరి మన్ననలు పొందిన దేశ నేతల్లో మన్మోహన్ సింగ్, వాజ్‌పేయిలు ముందు వరుసలో ఉంటారన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ యావత్ జాతి గర్వించదగిన నేత మన్మోహన్ సింగ్ మరణం తీరని లోటన్నారు. చారిత్రాత్మక నిర్ణయాలతో భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన మేధ సంపన్నులని కొనియాడారు. తొలుత మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, 2 నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ సి.హెచ్.శ్రీనివాస్, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, కౌన్సిల్ సెక్రటరీ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మానస సరోవరం అభివృద్ధికి చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు



మానస సరోవరంలో పర్యటిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: మానస సరోవరం పార్క్‌లో జంగిల్ క్లియర్ చేసి, పీపీటీ విధానం ద్వారా ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ జాతీయ రహదారి పక్కన ఉన్న గుంటూరు నగరపాలక సంస్థ మానస సరోవరం పార్క్‌ని పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తొలుత పార్క్ అంతటినీ పరిశీలించి, పార్క్ విస్తీర్ణం, బౌండరీలు, ఉన్న భవనాలు, టాయ్ లెట్స్, కాలువపై వంతెనలు, బోటింగ్ పాయింట్ల ప్రస్తుత స్థితిపై నివేదిక ఇవ్వాలని ఈఈని కోరారు. గుంటూరు నగరపాలక సంస్థ మానససరోవరం పార్కు ఎంతో కీలకమని, గతంలో నగరంతోపాటు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి విద్యార్థులు పార్కుని సందర్శించడానికి వచ్చేవారన్నారు. ప్రస్తుతం పిచ్చి మొక్కలు పెరిగి విష పురుగులకు ఆవాసంగా ఉందని, పార్క్‌ని అభివృద్ధి చేస్తే ప్రజలకు ఉత్తమ ఆహ్లాద కేంద్రంగా నిలుస్తుందన్నారు. పబ్లిక్ ప్రైవేట్ పార్టిసిపేషన్ (పీపీటీ) విధానంలో అభివృద్ధి చేయడానికి, సర్వే అనంతరం కాంపౌండ్ వాల్ నిర్మాణం చేయడానికి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఎస్ఈని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈ సుందర్రామిరెడ్డి, ఏడీహెచ్ శ్రీనివాస్, ఏఎంహెచ్ఓ రాంబాబు పాల్గొన్నారు.

లాప్రోస్కోపిక్ సూచరింగ్‌పై యువ వైద్యులకు శిక్షణ



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ రమణ, డాక్టర్ సుందరాచారి


గుంటూరు మెడికల్: ప్రభుత్వ సమగ్ర వైద్యశాల, నాట్కో క్యాన్సర్ సెంటర్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆంకాలజి నిర్వహణలో గుంటూరు వైద్య కళాశాలలోని ఎనాటమీ విభాగంలో శుక్రవారం లాప్రోస్కోపిక్ సూచరింగ్, చిన్న పేగు, పెద్ద పేగు, పంక్రీస్ అనాస్టోమోసిస్ ప్రక్రియపై వర్క్ షాప్ శనివారం నిర్వహించారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంగ్లాండ్‌లో స్థిరపడిన ప్రముఖ శస్త్ర చికిత్స నిపుణుడు, గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ సోమయ్య ఆరూరి, హైదరాబాద్ కాంటినెంటల్ హాస్పిటల్ రోబోటిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ గణేష్ గొర్తి వర్క్ షాప్‌లో తమ అనుభవాలు యువ వైద్యులకు వివరించారు. వర్క్ షాప్ ఇంట్రావుపెరేటివ్ అల్ట్రాసౌండ్ వాడుతూ లివర్ ఆపరేషన్స్ నిర్వహించటంపై అవగాహన కల్పించారు. సర్జికల్ ఆంకోలాస్ట్ డాక్టర్ జాహ్నవి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఈ విధంగా శిక్షణ ఇవ్వడం మొదటిసారి అన్నారు. ఈ శిక్షణ యువ వైద్యులకు ఎంతగానో ఉపయోగ పడుతుందని చెప్పా. జనరల్ సర్జరీ, సర్జికల్ ఆంకోలజీ విభాగాలకు చెందిన వైద్యులు డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ వెంకారెడ్డి, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ శివరామ కృష్ణ, డాక్టర్ మురళీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్యులు పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రములో పాల్గొన్న వైదులు డాక్టర్ సోమయ్య అరూరికి అభినందనలు తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో 60 మంది వైద్యులు పాల్గొన్నారు.

సకుటుంబనామ్ టీం సందడి



గుంటూరు రూరల్: చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో హెచ్ఎన్‌జీ బ్యానర్ నిర్మాతలు హెచ్ మహాదేవ్‌గౌడ్, నాగరత్న పూర్తిగా నూతన నటులతో నిర్మించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమా సకుటుంబనామ్ టీం సందడి చేసింది. చిత్ర కథానాయకుడు రామ్‌కిరణ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మంచి కథనంతో తీసిన చిత్రం ఘనవిజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. చిత్ర దర్శకులు ఉదయ్‌శర్మ మాట్లాడారు. పాటలు అనంత శ్రీరామ్ రాయగా ప్రముఖ సంగీత దర్శకులు మణిశర్మ సారథ్యంలో ఒకటి రెండు పాటల చిత్రీకరణ మినహా సినిమా మొత్తం పూర్తయిందని ఫిబ్రవరిలో ఉభయ తెలుగు రాష్ట్రాలలో విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ మధు దాసరి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రోహిత్, నటులు నవీన్‌జిపి, రచ్చరవి, నిత్య, సిమ్మి పాల్గొన్నారు.

'కిక్' కోసం శానిటైజర్..



- అవసరం లేకున్నా.. కొందరికి జోరుగా విక్రయాలు
- బక్కచిక్కిపోతున్న బానిసలు
- ఛిద్రమవుతున్న కుటుంబాలు



కోబాల్దుపేట కృష్ణాశ్రమం ప్రహరీ వద్ద తాగుతున్న వ్యక్తి..



తాగేసిన శానిటైజర్ డబ్బాలు

నగరంపాలెం: సుమారు ఐదేళ్ల క్రితం శానిటైజర్ వాడకంతో అనేక మంది కోవిడ్-19 నుంచి బయటపడ్డారు. ప్రస్తుతం అదే శానిటైజర్ అవసరం లేకున్నా కొందరికి విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. తక్కువ ధరకు లభించడంతో మరింతగా మత్తులో ఊగిసలాడుతున్నారు. దీంతో క్రమేపి శరీరంలో మార్పులు వస్తున్నాయి. వారిలో ముఖం ఉబ్బడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు బయటపడుతున్నాయి. జీవితాలు అర్ధాంతంగా ఆగిపోతున్నా.. నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. ఏమాత్రం ఆరోగ్యంపై దృష్టి సారించడంలేదు. గుంటూరు నగరంలో కొందరు చిల్లర, మెడికల్ దుకాణదారుల విచ్చలవిడి అమ్మకాలతో.. మరికొందరి జీవితాలను మధ్యలో చిదిమేస్తున్నాయి. యుక్త వయసులో వారు బానిసలవుతున్నారు.

ఒకప్పుడు ప్రయోజనం..

విడతల వారిగా వచ్చిన కోవిడ్-19 వేళల్లో శానిటైజర్ విక్రయాలు అధికంగా జరిగాయి. అప్పట్లో ఎవ రితోనైనా కరచాలనం చేసిన, ఏదైనా తాకిన వెంటనే శానిటైజర్ రాసుకునేవారు. తద్వారా ప్రాణాలు కాపాడుకునేవారు. ప్రస్తుతం అందుకు భిన్నంగా మారింది. చాలా మంది కిక్ కోసం తాగేస్తున్నారు. దీంతో కనీసం నాలుగైదు గంటలు వరకు మత్తులో ఉండిపోతున్నారు. అధిక శాతం కుటుంబ బాధ్యతలను వదిలేసిన వారు, ఒంటరి జీవితాలు గడిపే వారు బానిసగా మారుతున్నారు. గతంలో ఎంచక్కా మద్యం తాగే వారు ప్రస్తుతం దారి మళ్లింది. అల్కాహాల్ సీసాలు కొనుగోలు చేసేందుకు కనీసం రూ.100లైనా వెచ్చించేందుకు ఇష్టపడనివారు.. తక్కువ ధరకు లభ్యమవుతున్న శానిటైజర్ డబ్బాలను కొనుగోలు చేసి ఎంచక్కా తాగేస్తున్నారు.

ఎలా తాగేస్తున్నారంటే...

గుంటూరు నగర పరిధిలోని కోబాల్డ్‌పేటలోని ఓ రైస్ మిల్లు సమీపాన, జిన్నా టవర్ కూడలిలో, శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన్ మందిరం వెళ్లే రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు దగ్గర్లో శానిటైజర్ తాగే వారు ఉంటున్నారు. ఆయా ప్రాంతాలకు దగ్గర్లో ఉన్న కొన్ని చిల్లర, మెడికల్ దుకాణాల్లో లభ్యమవుతున్నాయి. లాభాలను చూసుకుని విక్రయిస్తున్నారు. వంద ఎంఎల్ సీసాలపై ఎమ్మార్పీ రూ.50, రూ.40లకు విక్రయిస్తారు. చాలా వరకు రూ.50 చెల్లించి, ఒక శానిటైజర్ డబ్బా, రెండు ప్లాస్టిక్ గ్లాస్‌లు, ఒక నీళ్ల సీసా కొనుగోలు చేస్తున్నారు. ఒక సీసాను ఇద్దరు తాగేస్తున్నారు. నీలి రంగులో ఉండే శానిటైజర్‌లో ఏదోక శీతల పానీయం కలిపి తాగి, ఊగిసలాడుతున్నారు. దుకాణదారులు కాగితపు సంచుల్లో పెట్టి చాటుమాటుగా విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో జన సంచారంతో రద్దీగా ఉన్న.. ఏం పట్టనట్టుగా తాగేస్తున్నారు. కోబాల్డుపేట ప్రధాన రహదారిలో కృష్ణాశ్రమం ప్రహరీ వద్ద ఎవరికి కనిపించకుండా నిలబడి తాగుతున్నారు. తాగాక అక్కడ్నుంచి నెమ్మదిగా జారుకుంటున్నారు. మరి కొం దరైతే అక్కడే ఉంటూ పిచ్చపాటి కబుర్లతో కాలక్షేపం చేస్తున్నారు. ఒక్కొక్కసారి కి క్ ఎక్కువై అక్కడే నిద్రలోకి జారుకుంటున్నారు.

హెచ్చరించినా..

గతంలో కోబాల్డుపేట ప్రధాన రహదారిలోని పలు దుకాణాలపై, ఇతరత్రా ప్రాంతాల్లోనూ గతంలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అప్పట్లో దుకాణ ధారులను ఔషధ నియంత్రణ శాఖ, స్థానిక పోలీసులు హెచ్చరించారు. ఒకరిద్దరిపై కేసులు కూడా నమోదు చేసినట్లు స్థానికులు తెలిపారు. అయినా వారిలో ఇసుకంతైనా మార్పు కనిపించడంలేదు. వెరసి శానిటైజర్ తాగి కొందరు ప్రాణాలు విడిచిన వారు లేకపోలేదు.

క్రమేణా మార్పులు..

శానిటైజర్ తాగే వారిలో శరీరంలో మార్పులు వస్తున్నాయి. శరీరంలో అవయవాలు దెబ్బతినడంతో.. క్రమేణా వారి ముఖం, పొట్ట ఉబ్బడం జరుగుతున్నాయి. అంతేగాక సన్నగా మారుతున్నారు. చాలా వరకు అనారోగ్యానికి గురై నెమ్మదిగా నడుస్తున్నారు. బక్కచిక్కి మృత్యుఒడికి చేరుతున్నారు. దీంతో పలు కుటుంబాలు పెద్దదిక్కుని కోల్పోతున్నాయి.

బాలికను గర్భిణిని చేసిన యువకుడిపై కేసు

లక్ష్మీపురం: పదో తరగతి చదువుతున్న బాలికకు మాయమాటలు చెప్పి గర్భిణిని చేసిన కె.అజయ్ భాస్కర్‌పై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. గుంటూరు నగరంలోని ఇమ్మానియేల్‌పేట డొంకరోడ్డుకు చెందిన కె.అజయ్ భాస్కర్, ఇంటర్మీడియెట్ చదివి అనంతరం ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. యువకుడి ఇంటి సమీపంలో పదో తరగతి చదువుతున్న బాలికతో మాట కలిపాడు. సుమారు రెండు సంవత్సరాల పాటు స్నేహంగా మెలిగాడు. బాలిక కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక భయపడి విషయం తల్లిదండ్రులకు చెప్పలేదు. అనంతరం ఆ బాలిక గర్భం దాల్చింది. తనకు కడుపులో నొప్పిగా ఉందని బాలిక కుటుంబ సభ్యులకు చెప్పింది. ఆస్పత్రికి తరలించే సమయానికి బాలిక ఇంటి వద్దనే ప్రసవించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి వెళ్లి వివరాలు నమోదు చేశారు. అనంతరం బాలికను ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.